నాణ్యమైన వసతులు కల్పిస్తున్నాం

- ఓయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్
- అధికారులతో కలిసి విద్యార్థుల హాస్టళ్లను సందర్శించిన వీసీ

ఓయూ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌లో మందులను పరిశీలిస్తున్న వీసీ ప్రొఫెసర్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థులకు నాణ్యమైన మౌలిక వసతులను కల్పించడంతోపాటు, శుభ్రమైన పచ్చని వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నామని వీసీ ప్రొఫెసర్ కుమార్ స్పష్టం చేశారు. ఆ దిశగా తాము అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. క్యాంపస్‌లో కీలకమైన హెల్త్ సెంటర్, స్విమ్మింగ్ పూల్, సీఎఫ్ఆర్డీ భవనం, హాస్టళ్లను ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌కుమార్‌నాయక్‌తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. హాస్టళ్ల చుట్టుపక్కల పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తక్షణమే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో క్రమం తప్పకుండా స్వచ్ఛభారత్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

దూర విద్య డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్ సీడీఈ) ద్వారా అందించే డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీబీఏ తదితర కోర్సుల మొదటి, రెండు, మూడో సంవత్సరం రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

కొర్వి బాలకృష్ణకు ఓయూ డాక్టరేట్

కొర్వి బాలకృష్ణ ముదిరాజ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగంలో కొరివి బాలకృష్ణ ముదిరాజ్ డాక్టరేట్ సాధించారు. డాక్టర్ కొండా నాగేశ్వరరావు పర్యవేక్షణలో 'ఎన్హాన్సింగ్ సాఫ్ట్ స్కిల్స్ త్రూ లిటరేచర్ అమాంగ్ స్టూడెంట్స్ ఆఫ్ ప్రొఫెషనల్ కోర్సెస్ ఇన్ తెలంగాణ: ఏ స్టడీ' అంశంపై పరిశోధన పూర్తి చేసి బాలకృష్ణ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన బాలకృష్ణ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు అభినందించారు.

పవర్ బోర్ పనులకు మరమ్మతులు

పవర్ బోరుకు మరమ్మతులు చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడ్డగుట్ట, మే 9: అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆదేశాల మేరకు ఏ, డీ సెక్షన్లలో పవర్ బోర్లకు బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం మరమ్మతులను చేయించారు. ఎండాకాలంలో ప్రజలకు ఎలాంటి నీటి కష్టాలు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, రామప్పచారి, సుందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

13న తాళ్లపాక అన్నమయ్య జయంతి

తాళ్లపాక అన్నమాచార్య జయంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జి.వసుంధర, విజయ్‌కుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి తదితరులు

చిక్కడపల్లి, మే 8: నవ్య నాటక సమితి, అన్నమాచార్య మిషన్ల సంయుక్తాధ్వర్యంలో తాళ్లపాక అన్నయ్య 617వ జయంతిని ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు వేమరాజు విజయకుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి, నిష్టల సుధామాల తెలియజేశారు. కార్యక్రమ పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా అండ్ లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర శుక్రవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో జరిగే కార్యక్రమంలో నృత్య గురువు సీతాప్రసాద్ లక్ష్మి బృందం అన్నమయ్య కథ సంగీత నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారని ఈ సందర్భంగా వారు వివరించారు. కార్యక్రమంలో భాగంగా సంగీత కళాకారులు డాక్టర్ వై.రమాప్రభ, డాక్టర్ ద్విభాష్యం వీఎస్ఎన్ మూర్తి శిష్య బృందం అన్నమయ్య సంకీర్తనా గానం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.చంద్రశేఖర్, రజిత్ ఆకుల, కామిశెట్టి ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాముకు కళా సుబ్బారావు స్మారక పురస్కారం ప్రదానం

ముషీరాబాద్, మే 9: ప్రముఖ కవి, రసమయి సాంస్కృతిక సంస్థ స్థాపకుడు డాక్టర్ ఎంకే రాముకు త్యాగరాయ గానసభ వ్యవస్థాపకులు కళా సుబ్బారావు స్మారక సాంస్కృతిక పురస్కారం అందుకున్నారు. త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై సాంస్కృతిక సంస్థల అభిమాని, కళా పోషకుడు కళా సుబ్బారావు జయంతి వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా శాసన మండలి ప్రతి పక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి పాల్గొని డాక్టర్ రాముకు కళా సుబ్బారావు స్మారక పురస్కారాన్ని అందించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్, చారిత్రక నవల రచయిత ఆచార్య ముదిగొండ శివప్రసాద్, ఆధ్యాత్మిక సాహితీవేత్త నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు. మల్లాది భావనా దీప్తి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది.

ఎంకే రాముకు పురస్కారాన్ని అందిస్తున్న మండలి విపక్ష నేత మధుసూదనాచారి

ఆకట్టుకున్న అంబావిలాసం

వెంకటరమణశాస్త్రిని సత్కరించిన మద్దాలి రఘురాం

ముషీరాబాద్, మే 9: కిన్నెర ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో డాక్టర్ పుచ్చ వెంకటరమణశాస్త్రి సంగీత ఆనందలహరి అంబావిలాసం సంగీత కచేరి పలువురిని ఆకట్టుకుంది. శుక్రవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో ఈ కార్యక్రమంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్ కార్యదర్శి మద్దాలి రఘురాం పాల్గొని వెంకటరమణశాస్త్రిని సత్కరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, మే 9: టీఎస్ఎస్‌పీడీసీఎల్ అజామాబాద్ డివిజన్ బర్కత్‌పుర, శంకర్‌మఠ్, బౌద్ధనగర్, సీఈకాలనీ, జిందాతిలిస్మాత్ ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ ఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలోని కౌసర్ మసీద్, బీజేపీ ఆఫీస్ లైన్, వారసిగూడ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు బర్కత్‌పుర, శంకర్‌మఠ్, బౌద్ధనగర్ ఫీడర్ల పరిధిలోని బర్కత్‌పుర, పద్మకాలనీ, వెజిటేబుల్ మార్కెట్, శంకర్‌మఠ్, నల్లకుంట మాతృశ్రీ స్కూల్, అమర్ మెటర్నిటీ హాస్పిటల్, కౌసర్ మసీదు లైన్, వారాసిగూడ, మోర్ సూపర్ మార్కెట్, బౌద్ధనగర్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీఈకాలనీ, జిందాతిలిస్మాత్ ఫీడర్ల పరిధిలోని శివం, శారదనగర్, సాయిబాబానగర్, ఈ సేవ, బాగ్ అంబర్‌పేట్, జిందాతెలిస్మాత్, శంకర్‌నగర్, అన్నపూర్ణనగర్, దుర్గానగర్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

భారత సైన్యానికి మద్దతుగా చండీహోమం

ఆలయంలో హోమాలు నిర్వహిస్తున్న వేద పండితులు పాల్గొన్న దేవాదాయశాఖ కార్య నిర్వహణ అధికారులు

బల్కంపేట ఎల్లమ దేవాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చండీహోమం

అమీర్‌పేట్, మే 9: దాయాదితో సనిహద్దుల్లో ధైర్యంగా పోరాడుతున్న భారత సైన్యానికి మద్దతుగా విజయాన్ని చేకూర్చాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బల్కంపేట ఎల్లమ ఆలయంలో శుక్రవారం చండీ హోమం జరిగింది. భార ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విషయం విదితమే. దేవాలయ వేద పండితులు చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో వేదపండితులు రామనాథశర్మ, రాజీవ్‌దత్త క్రతువును విజయవంతంగా నిర్వహించారు. చండీ హోమంలో ఆలయ ఈవో బి.కృష్ణ, దేవాలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు కొత్తపల్లి సాయిబాబా గౌడ్‌తో పాటు ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ రోడ్ హనుమాన్ ఆలయంలో..

బేగంపేట్: ఎస్సీ రోడ్ హనుమాన్ ఆలయంలో ఈవో సత్యనారాయణ ఆధ్వర్యంలో సైన్యానికి మద్దతుగా హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను ప్రదర్శించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించినట్లు ఈవో తెలిపారు. అలాగే సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలోనూ ఈవో గుత్త మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. భారత సైనికులకు ధైర్యసహసాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

నిరంతర పోరాట స్ఫూర్తి కామ్రేడ్ బీఎన్ రెడ్డి

చిక్కడపల్లి, మే 9: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ, ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి(బీఎన్) 17వ వర్ధంతి శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు తుడుం అనిల్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వనం సుధాకర్ హాజరై మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం పాలనను ఎదురొడ్డి తుపాకీ చేతపట్టి పోరాడిన విప్లవ యోధుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి అని కొనియాడారు. నాటి తెలంగాణ పల్లెల్లో భూస్వాముల చెంతన ఉన్న భూములను పేదలకు పంచడానికి దున్నేవాడికి భూమి కావాలని మొదటిసారిగా నినాదం ఇచ్చిన వీరుడు బీఎన్ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జి.మల్లేశ్, ఎ.పుష్ప, పల్లె మురళి, ఇ.దశరథ్‌నాయక్, యాదగిరి, కుంభం సుకన్య, తాండ్ర కళావతి, పి.భాగ్యమ్మ, గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యులు వై.రాంబాబు, కిష్టయ్య, టి.పుష్పలత, జి.సునీత, లలిత, పార్వతి, రాజు, నరసింహ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులపై కేసు

కాచిగూడ, మే 9: నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ ప్రాంతానికి చెందిన నవీన్‌కుమార్, సురేశ్‌శెట్టి ఇద్దరు కలిసి కాచిగూడలోని ఓ హోటల్లో గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకొని రెండు ఖరీదైన ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తా..

చర్లపల్లి, మే 9: తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని చర్లపల్లి కార్పొరేటర్, జీహెచ్ ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన బోరు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా ప్రభాకర్, నాగిళ్ల బాల్‌రెడ్డి, బత్తుల శ్రీకాంత్‌యాదవ్, రాజుగౌడ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గృహిణిని మోసగించిన వ్యక్తి రిమాండ్

కాచిగూడ, మే 9: గృహిణిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ సీఐ తల్లోజు జోత్స్న వివరాల ప్రకారం.. కాచిగూడలోని మౌలానా ఆజాద్‌నగర్‌కు చెందిన భరత్(38)చిన్ననాటి స్నేహితురాలైన నాం పల్లికి చెందిన 35 ఏండ్ల మహిళను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో కట్టుకున్న భర్తకు విడాకులు ఇచ్చింది. కొన్ని రోజులు గా ఆ మహిళతో భరత్ సహజీవనం గడిపాడు. పెళ్లి చేసుకోమని ఆ మహిళ ఒత్తిడి తేవడంతో భరత్ పొంతన లేని సమాధానలు చెబుతూ తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన మహిళ కాచిగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. భరత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

గోల్నాక, మే 9: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రూబీ స్టీవెన్ సన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిండిగ వెంకన్నతో కలిసి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల స్థలం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. నెలకు రూ.10వేల పెన్షన్, హెల్త్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను త్యాగం చేశారని, ఉద్యమకారుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

ఆలుగడ్డ బావి వద్ద ట్రాఫిక్ పోలీసులతో సీఐ శ్రీనివాసులు

అడ్డగుట్ట, మే 9: నిత్యం రోడ్లపై ఉంటూ విధులను నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు వారి ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చిలకలగూడ ట్రాఫిక్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు సూచించారు. ఎండలో ఉంటూ విధులను నిర్వహించే ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు వారికి క్యాపులు, చలువ కంటి అద్దాలు, వాటర్ బాటిల్ కిట్లను అందజేయడంతో చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ ఉద్యోగుల ఆరోగ్యం పట్ల ఉన్నతాధికారులు తీసుకుంటున్న చొరవ చాలా గొప్పదని ఆయన తెలిపారు.

లక్ష్మీకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం

పురస్కారాన్ని అందించిన ఉదయ్‌కుమార్, ముదిగొండ శివప్రసాద్

ముషీరాబాద్, మే 9: కమలాకర చారిత బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం త్యాగరాయ గానసభలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు ములకలూరి లక్ష్మీకృష్ణకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. సంగీత దర్శకుడు ఉదయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని లక్ష్మీకృష్ణకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య టి.గౌరీశంకర్, నవలా రచయిత ముదిగొండ శివప్రసాద్, భారతి, అనంతలక్ష్మి, కమలాకర భారతి సంస్థ వ్యవస్థాపకురాలు భారతీ కమలాకర్, లలితా పరమేశ్వరి, జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిక్ నగర్‌లో బడిబాట

కొండాపూర్, మే 9 : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందిస్తూ, ప్రైవేటు బడులకు దీటుగా తీర్చిదిద్దుతున్నామంటూ శుక్రవారం కొండాపూర్ పరిధిలోని సిద్దిక్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీలోని ఇంటింటికి తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పైవేటుకు దీటుగా పదవ తరగతి ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ప్రజలలో శాంతిభద్రతలపై అవగాహనను పెంచడానికి గురువారం ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ పోలీసులు మెహదీపట్నంలో కవాతు నిర్వహించారు. డీసీపీ చంద్రమోహన్ నేతృత్వంలో ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ్‌శ్రీనివాస్, సీఐలు ఆనంద్, మల్లేశ్ ఆధ్వర్యంలో కవాతును నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ ప్రజల్లో ఉండే భయాందోళనలను దూరం చేయడానికి పోలీసులు కృషి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి అపోహలు లేకుండా అవగాహన నిర్వహించాలన్నారు. – మెహిదీపట్నం, మే 9